

సిబ్బందికి పరీక్షలు చేస్తున్న ఎన్‌జీవో ప్రతినిధులు, వైద్యులు

# మెరుగైన వైద్య సేవలందించాలి

- ఆదిలాబాద్ డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్
- టీబీ కార్యాలయంలో సిబ్బందికి పరీక్షలు

ఎదులాపురం, ఏప్రిల్ 13 : టీబీ కార్యాలయంలో పని చేస్తున్న సిబ్బంది జాగ్రత్తలు పాటిస్తూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదిలాబాద్ డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ సూచించారు. శనివారం జిల్లా టీబీ కార్యాలయంలో వైద్యసిబ్బందికి పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ టీబీ కార్యాలయంలో పని చేస్తున్న సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాన్ని షేర్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించాడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, ఫల్మనాలజీస్ట్ డాక్టర్ సందీప్ జాదవ్, టీబీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సాయిప్రియ, షేర్ ఇండియా స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ సతీశ్ , ఉన్నారు.


వివాదాస్పద స్థలంలో విచారణ జరుపుతున్న అధికారులు

# సమస్య పరిష్కరిస్తాం..

- సంయమనం పాటించాలి
- స్థల వివాదంపై గ్రామస్తులకు అధికారుల సూచన

కుభీర్, ఏప్రిల్ 13 : కుభీర్ మండలం పార్డి(కె) గ్రామంలోని ప్రభుత్వ స్థలంలో ఉన్న గ్రామ దేవత మారెమ్మ గద్దె, అంబేద్కర్ విగ్రహం వద్ద దళితులు అంబేద్కర్ విగ్రహం చుట్టూ ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టారు. దీంతో గ్రామస్తులు, దళితులకు మధ్య వివాదం తలెత్తింది. దీంతో గ్రామస్తులు కుభీర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యదర్శి స్వరాజ్ సైతం ఎంపీవో, తహసీల్దార్, ఎంపీడీవోకు రాత పూర్వకంగా సమస్యను వివరించారు. కాగా శనివారం తహసీల్దార్ ముంజం సోము, ఎంపీడీవో శ్రీనివాస్, ఎస్ఐ రవీందర్, ప్రత్యేకాధికారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ హన్మాండ్లు, మండల పంచాయతీ అధికారి గోవర్ధన్ గ్రామానికి చేరుకొని వివాదస్పద స్థలాన్ని పరిశీలించారు. ఇరు వర్గాలతో వేర్వేరుగా చర్చలు జరిపారు. చర్చలు విఫలమవడంతో మరోసారి ఇరు వర్గాల పెద్దలతో సమావేశమై, సమస్యను పరిష్కరిస్తామని వారు వెల్లడించారు. అప్పటి వరకు సంయమనం పాటించాలని, ఆ స్థలంలో పనులు నిలిపేయాలని వారికి సూచించారు. గ్రామస్తులంతా సామరస్యంగా సమస్యను పరిష్కరించుకోవాలని తెలిపారు. దళితులు, యువకులు, గ్రామస్తులున్నారు.

# బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

- ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ ఆలం
- జూనియర్ అసిస్టెంట్ అక్షయ్ కుటుంబ సభ్యులకు పరామర్శ
- తక్షణ సాయంగా రూ.20వేలు అందజేత


అక్షయ్(ఫైల్)

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 13 : దేవాపూర్ చెక్ పోస్ట్ సమీపంలోని జాతీయ రహదారి-44పై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ అక్షయ్, నిజామాబాద్‌లోని ప్రైవేటు దవాఖానలో చికిత్స పొందుతూ శనివారం గుండెపోటుతో మృతి చెందాడు. అక్షయ్ ఆదిలాబాద్ జిల్లా పోలీసు కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మృతదేహం వద్ద ఎస్పీ గౌస్ ఆలం పుష్పగుచ్ఛం ఉంచి, నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిబ్బందిని కోల్పోవడం చాలా బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం పరంగా వచ్చే లబ్ధిని త్వరగా చేకూరేలా చూడాలని పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లును ఆదేశించారు. తక్షణ సాయంగా రూ.20 వేలను కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ నవీన్, డిస్ట్రిక్ట్ పోలీస్ కార్యాలయ సిబ్బంది, నార్నూర్ సర్పంచ్ గజానన్ తదితరులు పాల్గొన్నారు.


భానోత్ అక్షయ్ మృతదేహం వద్ద నివాళులర్పించి, తల్లికి ధైర్యం చెబుతున్న ఎస్పీ గౌస్ ఆలం

# అంబేద్కర్ జీవితం స్ఫూర్తిదాయకం

భైంసా, ఏప్రిల్ 13 : అంబేద్కర్ జీవితం స్ఫూర్తిదాయకమని పలువురు అన్నారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ఆయన జీవిత చరిత్రపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్ గడ్‌పాలే, ప్రసన్నజిత్ హెమ్లె, శంకర్ చంద్రే, ప్రసన్నజిత్ ఆగ్రే, గంగాధర్ దగ్దే తదితరులు పాల్గొన్నారు.

**నిర్మల్ డిగ్రీ కళాశాలలో..**

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 13 : నిర్మల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంబేద్కర్, మహాత్మా జ్యోతి బాపూలే జయంతి వేడుకలను నిర్వహించారు. వారి చిత్రపటాలకు కళాశాల ప్రిన్సిపాల్ భీంరావ్ పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశ అభివృద్ధికి, అంటరానితనం నిర్మూలన కోసం, విద్యాభివృద్ధికి వారు ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. వారి అడుగు జాడల్లో నడిచి, వారి ఆశయ సాధనకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పీజీ రెడ్డి తదితరులున్నారు.

**సొనాలలోని పాఠశాలలో..**

బోథ్, ఏప్రిల్ 13 : మండలంలోని సొనాల వివేకానంద పాఠశాలలో శనివారం అంబేద్కర్ జయంతి నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణ చైతన్య, ఓరుగంటి ఇస్తారి, కే శుద్ధోధన్, స్నేహిక, రజిని, సౌమ్య, నిత్య, దివ్య, ప్రవలిక, సుష్మ పాల్గొన్నారు.


భైంసా : విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న నాయకులు


నిర్మల్ అర్బన్ : నివాళులర్పిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు


బోథ్ : సొనాల వివేకానంద పాఠశాలలో నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు


ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# గడప గడపకూ బీఆర్ఎస్ ప్రచారం

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 13 : ఆదిలాబాద్ రూరల్ మండలంలోని తంతోలి, సిరికొండ, చించుఘాట్, కొత్తూరు, అంకాపూర్ గ్రామాల్లో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు గడప గడపకు ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ చేసిన అభివృద్ధిని వివరించారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కుమ్ర రాజు, మోతిరాం, మాజీ సర్పంచ్ సిడాం లక్ష్మణ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీలో అంతర్గత పోరు

- ఎంపీ సోయం బాపురావ్ డుమ్మా

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 13 : ఆదిలాబాద్ బీజేపీలో అంతర్గత పోరు మరోసారి బయటపడింది. జిల్లాకేంద్రంలో శనివారం నిర్వహించిన పార్లమెంట్ పోలింగ్ బూత్ ఎన్నికల సమావేశంలో ఆ పార్టీ జాతీయ నాయకుడు మురళీధర్‌రావ్ పాల్గొన్నారు. ఈ సమావేశానికి ప్రస్తుత ఎంపీ సోయం బాపురావ్, మాజీ ఎంపీ రమేశ్ రాథోడ్ గైర్హాజరయ్యారు. ఎంపీ టికెట్ రాక పోవడంతో అసంతృప్తిగా ఉన్న వీరు, కొన్ని రోజులుగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. అధిష్ఠానం బుజ్జగించినప్పటికీ వీరు అలక వీడలేదు.

## ముమ్మరంగా పోలీసుల తనిఖీలు


తనిఖీ చేస్తున్న భైంసా పట్టణ ఎస్ఐ గౌస్

భైంసా, ఏప్రిల్ 13 : పట్టణంలోని పాత చెక్‌పోస్టు సమీపంలో శనివారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ గౌస్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సరైన ఆధారాలు లేకుండా నగదు తీసుకెళ్తే సీజ్ చేస్తామన్నారు. ఎస్ఐ వెంట పోలీసు సిబ్బంది తదితరులున్నారు.

## తెల్లకల్లు స్థావరాలపై ఎక్సైజ్ దాడులు


స్వాధీనం చేసుకున్న తెల్లకల్లుతో పోలీస్ సిబ్బంది

తాంసి(తలమడుగు), ఏప్రిల్ 13 : అనుమతి లేని తెల్లకల్లు స్థావరాలపై ఎక్సైజ్ సీఐ రేండ్ల విజేందర్ ఆధ్వర్యంలో శనివారం దాడులు నిర్వహించారు. తలమడుగు మండలం ఝరి, తలమడుగు, కుచులాపూర్, ఉమ్రి గ్రామాల్లో దాడులు నిర్వహించినట్లు పోలీస్‌లు తెలిపారు. ఈ దాడుల్లో అనుమతి లేని తెల్లకల్లు విక్రయాలు చేసిన ఐదుగురిపై కేసు నమోదు చేసి 143 లీటర్ల తెల్లకల్లు ధ్వంసం చేసినట్లు సీఐ తెలిపారు. అనుమతి లేకుండా కల్లు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. దాడిలో ఎక్సైజ్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కిరాణా దుకాణంలో చోరీ

కుభీర్, ఏప్రిల్ 13 : కుభీర్ మండల కేంద్రంలోని బజార్ గల్లీలో గల రషీద్ కిరాణా దుకాణంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. నిత్యావసర సరుకులు, పలు సామాన్లు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్ఐ రవీందర్ క్లూస్ టీంను రప్పించి, వేలిముద్రలు సేకరించారు. దుకాణాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. దుకాణంలోని సీసీ ఫుటేజీ పరిశీలించగా, చోరికి పాల్పడ్డ వ్యక్తి స్వెటర్ ధరించి, ముఖానికి మంకీ క్యాప్ వేసుకొని ఉన్నట్లు గుర్తించారు. దొంగలను త్వరలో పట్టుకుంటామని ఎస్ఐ తెలిపారు.

## శత చండీయాగంలో పాల్గొన్న మాజీ మంత్రి

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 13 :ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని దుర్గానగర్‌లోని దుర్గ మాత ఆలయంలో నిర్వహిస్తున్న శతచండీ యాగ పూజ కార్యక్రమాల్లో శనివారం మాజీ మంత్రి జోగు రామన్న పాల్గొన్నారు. అలాగే అద్దాల మేడలోని అమ్మవారిని దర్శించుకొని పూజ కార్యక్రమాలు చేపట్టారు. కిషన్ మహారాజ్ చేస్తున్న కృషికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

## 'గర్భిణి మృతికి వైద్యులే కారణం'


దవాఖాన వద్ద పోలీసుల బందోబస్తు

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 13 : ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం ఝరి గ్రామానికి చెందిన గర్భిణి హారతి (25) మృతికి నిర్మల్ పట్టణంలోని డాక్టర్స్ లేన్ కాలనీలోని డీఎస్‌కే దవాఖాన వైద్యులే కారణమని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. పది రోజుల క్రితం హారతిని ప్రసవం కోసం కుటుంబ సభ్యులు డీఎస్‌కే దవాఖానకు తీసుకువచ్చారు. ప్రసవం పొందిన తర్వాత హారతి తీవ్ర అస్వస్థతకు గురవడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. కాగా, పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. అయితే నాణ్యమైన వైద్యం అందించక పోవడం, ఇక్కడి వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. దవాఖాన ఎదుట నిరసన తెలిపారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకున్నారు. వైద్యులతో మాట్లాడించి, గొడవను సద్దుమనిగించారు.

## కరెన్సీపై విద్యార్థులకు అవగాహన

బోథ్, ఏప్రిల్ 13 : ఇంటర్‌నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మండలంలోని సాకెర మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులకు కరెన్సీపై అవగాహన కల్పించారు. ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి బాశెట్టి రాజ్‌కుమార్ విద్యార్థులకు ప్రపంచంలోని 40 దేశాలకు సంబంధించిన నోట్లు, నాణేల గురించి వివరించారు. పాత కాలంలో ఉపయోగించిన నాణేలు, వాటి విలువ గురించి తెలిపారు. అనంతరం గుండెపోటు వచ్చినప్పుడు చేసే సీఆర్పీ విధానం గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఎల్ అనుషా, ఉపాధ్యాయులు జీ కమలాకర్, శ్రీరాం విజయ్, అంగన్‌వాడీ టీచర్ సుశీల, సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులకు వివరిస్తున్న రాజ్‌కుమార్

## 'బీజేపీని ఓడిద్దాం.. దేశాన్ని కాపాడుకుందాం'



మాట్లాడుతున్న బండారు రవికుమార్

ఎదులాపురం, ఏప్రిల్ 13 : బీజేపీ ప్రభుత్వ మతోన్మాద ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా భారత రాజ్యాంగ రక్షణకు దేశ ప్రజలందరూ సిద్ధమై రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారు రవికుమార్ పిలుపునిచ్చారు. వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బీసీ సంఘ భవనంలో నిర్వహించిన జిల్లా సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. పదేళ్ల పాలనలో ప్రజలకు ఉపయోగపడే ఏ ఒక్క పనీ చేయాలేదని ఆరోపించారు. మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ ప్రజల మధ్య విభజనను తీసుకొచ్చే ప్రయత్నం చేసిందన్నారు. నాయకులు దర్శనాల మల్లేశ్, లంక రాఘవులు, అన్నమొల్ల కిరణ్, సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి, పట్టణ కార్యదర్శి అరుణ్‌కుమార్, అమీనా, సీపీఐఎంఎల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్, జగన్‌సింగ్, జే రాజు, వెంకట్ నారాయణ పాల్గొన్నారు.

## ఇస్కాన్ ఆధ్వర్యంలో శ్రీరామ నవమి వేడుకలు

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 13 : శ్రీ రామ నవమిని పురస్కరించుకొని అంతర్జాతీయ కృష్ణ చైతన్య మండలి ఇస్కాన్ ఆధ్వర్యంలో ఈ నెల 15, 16, 17వ తేదీల్లో మూడు రోజుల పాటు ఘనంగా వేడుకలు నిర్వహించనున్నట్లు ఇస్కాన్ ప్రతినిధి ప్రేమ నర్తన్ దాస్‌జీ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం శ్రీ రామ నవమి పోస్టర్ విడుదల చేశారు. ఈ సమావేశంలో ఇస్కాన్ ప్రతినిధులు పూర్ణ చంద్ర కృష్ణ ప్రభు, గిరివరదాస్, ప్రమోద్ ఖత్రి పాల్గొన్నారు.

**శోభాయాత్రను జయప్రదం చేయండి..**

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 13 : నిర్మల్ పట్టణంలో హిందూ వాహిని ఆధ్వర్యంలో 17న శ్రీ రామ నవమిని పురస్కరించుకొని గురువారం నిర్వహించనున్న భారీ శోభాయాత్రను విజయవంతం చేయాలని హిందూ వాహిని సభ్యులు, కాలనీ వాసులు కోరారు. ఈ మేరకు సోఫినగర్ కాలనీలో పోస్టర్లను ఆవిష్కరించారు. హిందూ బంధువులు పట్టణ ప్రజలు హాజరై, జయప్రదం చేయాలని కోరారు.

## రోడ్డు భద్రతపై అవగాహన

కుభీర్, ఏప్రిల్ 13 : రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో భైంసా డీఎం అమృత ఆదేశాల మేరకు కుభీర్ బస్టాండ్‌లో శనివారం ఆర్టీసీ సిబ్బంది ప్రయాణికులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. టీ13 ఎంఏ హాఫ్, సేఫ్టీ వార్డెన్ సూపర్‌వైజర్ బర్కతుల్లా మాట్లాడుతూ.. ప్రయాణికుల సౌకర్యార్థం ప్రవేశపెట్టిన గమ్యం యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని, బస్సు వేళలు, ఇతర సమాచారాన్ని పొందాలని సూచించారు.

## అవగాహనా ర్యాలీ

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 13 : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల బృందం ఆధ్వర్యంలో శనివారం ఓటరు నమోదుపై అవగాహన ర్యాలీ తీశారు. 18 ఏండ్లు నిండిన యువతీయువకులు తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలని, ఓటర్లు తమ హక్కును వినియోగించుకోవాలని పాటల ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు గుంజాల రమేశ్, నర్సమ్మ, గోవిందరావ్, మురళీ, ఆశిష్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులకు టీకా వేయించాలి

నార్నూర్, ఏప్రిల్ 13 : చిన్నారులకు టీకా తప్పనిసరిగా వేయించాలని ఆరోగ్య పర్యవేక్షకుడు చౌహాన్ చరణ్‌దాస్ సూచించారు. మండలంలోని గుండాల తండా, గోండుగూడ గ్రామాల్లో శనివారం సందర్శించారు. గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు చేశారు. శిశువు ఎదుగుదలపై గర్భిణులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. వడదెబ్బ భారినపడే అవకాశాలుంటాయని, జాగ్రత్తలు పాటించాలని, నీళ్లు బాగా తాగాలని సూచించారు. ఇక్కడ వైద్య సిబ్బంది హిమబింధు, ఈశ్వరి, విద్యరాణి, అంగన్‌వాడీ టీచర్ సీతాబాయి, ఆశ కార్యకర్త కాంబ్లే జ్యోతిబాయి ఉన్నారు.

## పెండింగ్ డీఏలు విడుదల చేయాలి

ఖానాపూర్ టౌన్, ఏప్రిల్ 13 : పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను ఎన్నికల సంఘం అనుమతి తీసుకొని ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దాసరి శంకర్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో యూటీఎఫ్ 10 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం పట్టణంలో యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మురళీధర్, గురుకుల కన్వీనర్ అనిల్, మండల బాధ్యులు రాజేందర్, రమేశ్, నారాణ, రాజు తదితరులున్నారు.

## బీజేపీకి ఓటు అడిగే హక్కు లేదు

ఇచ్చోడ, ఏప్రిల్ 13 : మాల కులస్తులను ఓట్లు అడిగే హక్కు బీజేపీకి లేదని మావల సంక్షేమ సంఘం మండల మాజీ అధ్యక్షుడు శాంతపురపు రాజేశ్వర్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మాల కులస్తులు బీజేపీకి ఓటు వేయరని తెలిపారు. బీజేపీ కేవలం రాజకీయ లబ్ధి కోసమే ఐక్యంగా ఉన్న ఎస్సీలను విడగొట్టేందుకు చూస్తున్నదని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి తగిన బుద్ధి చెబుతామన్నారు. ఈ సమావేశంలో మాల సంఘం నాయకులు బత్తుల శివ, తొగరీ రాజేశ్వర్, ఈదుల్ల రాకేశ్ పాల్గొన్నారు.

## 15 నుంచి డ్రైవింగ్ శిక్షణ

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 13 : ఆర్టీసీ ఆదిలాబాద్ డిపోలో హెవీ మోటర్ వెహికల్ డ్రైవర్స్ ట్రైనింగ్ కొత్త బ్యాచ్‌ను ఈ నెల 15 నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని డిపో మేనేజర్ కల్పన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు హెవీ మోటర్ డ్రైవింగ్ నేర్చుకునేందుకు డీఎం కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఫీజు రూ.15,600 ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తప్పనిసరిగా లైట్ మోటర్ డ్రైవింగ్ లైసెన్స్, బ్యాచ్ నంబర్ కలిగి ఉండాలని పేర్కొన్నారు.

## రాజ్యాంగ పరిరక్షణకు ఏకం కావాలి

నిర్మల్ టౌన్, ఏప్రిల్ 13 : రాజ్యాంగ పరిరక్షణకు లౌకికవాదులంతా ఏకంకావాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు అడివయ్య పిలుపునిచ్చారు. నిర్మల్‌లో శనివారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో మోదీ ప్రభుత్వం అన్ని రంగాల్లో వైఫల్యం చెందిందని పేర్కొన్నారు. 10 ఏండ్ల పాలనలో ఆటు రైతులకు, ఇటు కార్మికులకు తీవ్ర అన్యాయం చేసిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకలు నూతన్‌కుమార్, పోశెట్టి, సురేశ్, సుజాత, నర్సయ్య, లలిత, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి సన్నిధిలో రాజన్న సిరిసిల్ల న్యాయమూర్తి

బాసర, ఏప్రిల్ 13 : బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారిని శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా న్యాయమూర్తి జస్టిస్ శ్రీమతి ప్రేమలత కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న వారికి అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తన మనుమరాలికి అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో ఆలయాధికారులు, సిబ్బంది ఉన్నారు.

## ఇంటికే రాములోరి తలంబ్రాలు

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 13 : శ్రీరామనవమి సందర్భంగా భద్రాద్రిలో జరిగే శ్రీసీతారాముల వారి కల్యాణ మహోత్సవ తలంబ్రాలను అక్కడికి వెళ్లలేని భక్తులకు ఆర్టీసీ ద్వారా అందజేయడం జరుగుతుందని ఆదిలాబాద్ డిపో మేనేజర్ కల్పన శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తలంబ్రాల కోసం జిల్లాలని కార్గో పార్సిల్ కేంద్రాల్లో భక్తులు ఒక ప్యాకెట్‌కు రూ.151 చెల్లించాలని తెలిపారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకుని తమ వివరాలను ఈనెల 18 వరకు నమోదు చేసుకోవాలని సూచించారు.


## ఆశ కార్యకర్తల సమస్య పరిష్కరించాలి

నిర్మల్ టౌన్, ఏప్రిల్ 13 : జిల్లాలో వైద్య రంగంలో పనిచేస్తున్న ఆశ వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సురేశ్ కుమార్ అన్నారు. పట్టణంలో స్థానిక కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ.. ప్రభుత్వం అన్ని సర్వేల్లో వారిని ఉపమోగించుకుంటున్నదని, తగిన ప్రోత్సాహం అందించడంలేదని పేర్కొన్నారు. పనికి తగ్గ పారితోషికం చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకలు సుజాత, గంగామణి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ బోల్తా..యువకుడు మృతి

సారంగాపూర్, ఏప్రిల్ 13 : మండలంలోని అలూర్ గ్రామ శివారులో శనివారం ట్రాకర్ బోల్తాపడడంతో ఒక యువకుడు మృతిచెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. అలూర్ నుంచి బండరాళ్లను గ్రామ శివారులో వేసేందుకు ట్రాక్టర్‌లో తరలిస్తున్నారు. ఈ క్రమంలో ముందు టైరు పగిలిపోవడంతో రోడ్డు పక్కనే ఉన్న పొలంలో బోల్తా కొట్టింది. డ్రైవర్ దాండ్ల దయాకర్(21)పై ట్రాక్టర్ పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లేలోపే మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు.

## నగదు స్వాధీనం


సోన్ : స్వాధీనం చేసుకున్న నగదుతో పోలీసులు

సోన్, ఏప్రిల్ 13 : సోన్ మండలం గంజాల్ టోల్ ప్లాజా వద్ద శనివారం రాత్రి వాహనాలను తనిఖీ చేస్తుండగా రూ.13.50లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సంతోషం రవీందర్ తెలిపారు. పత్రాలు లేకుండా తరలిస్తుండడంతో పట్టుకున్నామని, పంచనామా నిర్వహించి ఎన్నికల నియామవళి కమిటీకి అప్పగించనున్నట్లు పేర్కొన్నారు.

**సిర్పెల్లి(హెచ్) చెక్‌పోస్టు వద్ద రూ.80వేలు..**

కుభీర్, ఏప్రిల్ 13 : మండలంలోని మహారాష్ట్ర సరిహద్దు సిర్పెల్లి (హెచ్) చెక్‌పోస్టు వద్ద తనిఖీల్లో ఎలాంటి పత్రాలు లేని రూ.80 వేలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రవీందర్ తెలిపారు. ఆయన శనివారం పోలీస్ స్టేషన్‌లో వివరాలను వెల్లడించారు. భైంసా నుంచి మహారాష్ట్రలోని పాలజ్‌కు వెళ్తున్న జలాల్ నుంచి నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-311823-All

CHANGE OF NAME
I, SIDDIQUI SHAFIYA MOHMAD EJAJ AHMED (Old Name) D/o. MOHMAD EJAZ AHMED SIDDIQUI R/o.H.No.C-2-2-333, Ambedkar Nagar, Adilabad, Is hereby Declare that hence I Shall Known as "SHAFIYA SIDDIQA" (New name) As per SSC Memo And others. Holding Indian Passport No. S1256374, Dt. 14-02-2018 to 13-02-2023 Issued At Hyderabad. hence declared.

WANTED
★KFC Hiring P/F Time Jobs in Hyd. SSC Pass, 18 yrs Abv. M&F. 13k with Food & Accom. PF/ Medical/ Bonus/ Incentive. Ph: 9392526486, 9704449461, 8688442326.
NT-136-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677